# దినచర్య

విధీ విరామం ఎరగని బానిస, టెలిప్రింటరు టకటకా కొట్టుకుపోతున్నది. "సబ్బు" లందరూ తదేకధ్యానంతో రాస్తున్నారు. వాళ్ళముందర తర్జుమా కావలసిన టెలిగ్రాముల బొత్తులున్నాయి.

కైలాసం విసుక్కుంటూ రాస్తున్నాడు. తనబల్ల మీదికి వచ్చిన టెలిగ్రాములన్నీ ఒకసారి చూసుకున్నాడు. ఒక్కటైనా "మంచి టెలిగ్రాం లేదు "మంచి" టెలిగ్రాం అనేదానికి ప్రత్యేకమైన నిర్వచనం లేదు. ఒక్కోరోజు కైలాసం యూరపుదేశాల చెల్లింపు సమస్యల్ని గురించి ఎంతో ఆసక్తితో రాస్తాడు. ఒక్కోనాడు చక్కని కథలాంటి టెలిగ్రాం వచ్చినా విసుక్కుంటాడు.

కైలాసం రాసే "మూడ్"లో ఉండేదీ లేనిదీ నిర్ణయించేవి ఏవో ఎవరూ చెప్పలేరు. అతనిమీద సంఖ్యాజ్యోతిషం పనిచేస్తుంది. అనగా తారీఖుల ప్రభావం జాస్తిగా ఉంటుంది. 20కి పైబడిన తేదీ సంఖ్యలు కైలాసం "మూడ్" కు అనుకూలంగా ఉండవు. ఇంటిదగ్గిర భార్య చేసిపెట్టిన వంటకాల ప్రభావమూ, ఆఫీసుకు వచ్చేటప్పుడు బస్సు

స్టాండు దగ్గిర ఎండలో నిలబడే పిఘుపియల సాఖ్యాప్రభా వమూ కైలాసంమీద బలంగా ఉంటాయి.

టెలిగ్రాములు తిరగేసేటప్పుడే కైలాసం ఒక్కొక్క దానిమీదా ఒక్కొక్క ప్రత్యేక విమర్శ విసిరాడు. ఇండో నేషియాలో అల్లరి. వాళ్ళకు స్వాతంత్ర్యం అరగటం లేదు. అంతేకావాలి (వెధవలకు)...మలయాలో జాతీయవాదుల మీద బాంబులవర్షం. నల్లులమీద డీ డీ టీ కొట్టినట్టే. అందులో విషం ఉందట. నల్లులు హాయిగా డీ డీ టీ తినేసి మరిన్ని పిల్లల్ని పెడుతున్నాయి. కొంపనిండా నల్లులపుట్టలు. తెల్లోళ్లూ నిద్ర పోనివ్వవు. ...డీన్ ఎచిసన్ చైనాను ఉద్ధరించాడు, ఆసియాను ఉద్ధరిస్తాట్ట! ఈ అమెరికా కమ్యూనిజంనుంచి ఆసియాను ఉద్ధరిస్తుం దనుకోవటంకన్న బుద్ధి తక్కువ మరొకటిలేదు. నిజంగా డీ డీ టీ తినేనల్లులకూ ఈ కమ్యూనిస్టులకూ ఏమీ తేడా లేదు...

కైలాసం రాయటం మానేసి తలఎత్తి చూశాడు. డెమోక్రసీని ఉద్ధరించే సత్యనారాయణా, కమ్యూనిజమును ఉద్ధరించే భగవాన్లూ చర్చ ప్రారంభించారు. అది రోజూ ఉండే చర్చే భగవాన్లు రష్యామీద ఈగవాలనివ్వడు. సత్య నారాయణ రష్యాపేరు చెబితే పంచాంగం విప్పుతాడు.

“అసలు రహస్యం ఒక్కడికీ తెలీదు. రష్యా అమెరికా కలిసి మిగిలిన దేశాల్ని యుద్ధంలో ముంచటానికి చూస్తున్నారు. అందుకే నెహ్రూ ఎటూ చేరలేదు” అనుకున్నాడు కైలాసం.

ఎవరూ గ్రహించలేని సత్యాలు తెలుసుకుని ఎవ్వ

గిక్ చెప్పకుండా ఉండటంలో గొప్ప ఆనందంఉంది. ఆ ఆనందం కైలాసానికి రోజూ లభిస్తుంది.

"నువుపోయి రష్యా వెళ్ళి చూసివచ్చావు గామాలు" అన్నాడు సత్యనారాయణ.

"చూస్తేనే తెలియక్కర్లేదు. బుద్ధి ఉంటే అన్నీ తెలుస్తయ్" అన్నాడు భగవాన్లు.

"అవును! నీ ఒక్కడికే పెట్టాడు మరి దేవుడు ప్రపంచంలో ఉన్న బుద్ధంతా" అన్నాడు సత్యనారాయణ.

"పోనివ్వండయ్యా," అన్నాడు శివరావు.

కైలాసం తిరిగి తలవంచుకు రాసుకోబోతుండగా టెలిగ్రాఫు బంట్రోతు ఏదో టెలిగ్రాం తెచ్చి కైలాసం ముందు పెట్టాడు.

"అవతల ఆ బల్ల దగ్గిర ఇయ్యి" అన్నాడు కైలాసం. అమెరికా వెళ్ళి లియాఖతాలీఖాన్ పేలే లవాకులూ చవాకులూ రాయటం చాలక టెలిగ్రాములకు సంతకా లెవడు పెడుతూ కూచుంటాడు?"

"సుబ్రహ్మణ్యంగారూ, డినామాండుకు తెలుగేమిటి?" అని అడిగాడు పార్వతీశం.

"ఖైదులో ఉంచటంకాదూ?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఎవరో నవ్వారు.

"డినామాండంటే ఖైదులో ఉంచట మేమిటయ్యా?"

"డినామాండు, అని రాయవయ్యా దేవుడా?" అని ఇంకొకరు అందుకున్నారు.

"ఓహో, డిమాండా? నేనింకా రిమాండేమో అనుకున్నా, నిన్న ఇట్లాగే చిత్రం జరిగింది. నేనేమన్నానంటే-"

"అబ్బాయ్, 'కోరికా' అని రాసిపారెయ్యి. అంతకన్న మంచిమాట ఏ డిక్షనరీలోనూ దొరకదు" అన్నారు మరొకరు

"రిక్వెస్టంటే కోరికగాని డిమాండంటే కోరికేమిటి? దబాయింపు, అని రాయనా?"

"ఏదో రాయదల్చుకున్నవాడివి రాయక అందర్నీ చంపుతా వెందుకూ?"

మళ్ళీ సద్దుమణిగింది. కైలాసం లియాఖతాలీ "అభిభాషణ" దగ్గరికి తిరిగివచ్చాడు. ఇస్లామంటే డెమోక్రసీయేనంటున్నాడు లియాఖతాలీ.

"ఈ ఫ్రెంచిపేర్లు ఎట్లా రాయాలో మనకు తెలివదే. ఏమండి, దీక్షితులుగారూ, పి-ఐ-జి-ఎన్-ఓ-ఎన్ ఏమనాలి?"

"పాన్యో అనాలి."

"నే చచ్చినా అన్ను."

"పిగ్నాన్ అని రాయండి."

"ఆమాటన్నారు బాగుంది"

"ఈ దీక్షితులుగారొకడు పోగైనాడు మా ప్రాణానికి," అనుకున్నాడు కైలాసం, "సోయెకర్నో అనకూడదట! సుకర్నో అనాలిట! సుదర్శనో, సుమిత్రో అనాలిట! సోయెకర్నో అని రాస్తే అచ్చుపడదు కామాలు, అన్నీ వేసాలు!"

లియాఖతాలీ "అభిభాషణ అయేసరికే పుణ్యకాలం వెళ్లేట్టుంది. ఇంకా ఎచిసిన్ ఉద్ఘాటనా. మలయాలో కమ్యూనిస్టుల కిరాతక కృత్యాలూ, అదేదో రైలుప్రమాదమూ అట్లానే వున్నాయి.

"కైలాసంగారూ, లియాకతాలీని సమ్మరైజు చెయ్యటంలా? కొద్దిలో ముగించక పోయినారా?"

కైలాసానికి చాలా దుఃఖం వచ్చింది. కొద్దిలో ముగించాలని తెలిస్తే కైలాసం ఎప్పుడో పూర్తిచేసి ఉండును.

"టెలిప్రింటరు అరగంటనుంచీ కొట్టటంలేదు. ఏం జరిగిందో కాస్త కనుక్కుంటారా ఏమిటి?"

కైలాసం ఎగిరి గంతేసిలేచి టెలిఫోను దగ్గిరికి వెళ్లాడు.

"ఏమండీ? మెషీన్ ఆడటంలేదా? ఫైవ్ మినిట్స్ కిందకూడా క్రీడ్ చేస్తూ ఉన్నామే?... మా మెకానిక్‌తో కాపీలు పంపుతాం లెండీ" అన్నది రిసీవర్.

"సెమీ అఫీషియల్ అంటే ఏం రాయాలి?"

"అర్ధ ప్రభుత్వ—"

"అర్థ ప్రభుత్వా? వ్యర్థ ప్రభుత్వా?"

"అయితే నాకు తెలీదు"

"నీకే కాదు, మహామహావాళ్ళకు తెలీదు."

"అది సరేగాని ఎక్స్‌చేంజ్ అంటే ఏమిటోయ్?"

"మారకం."

"ఎవరి మారకం?"

"మారకం కాదులేవయ్యా, వినిమయమని రాయి."

"వినిమయమంటే ఖర్చుచెయ్యటం కాదుటండీ?"

"అది వినియోగం."

"వినిమయమేమిటి? వినియోగమేమిటి? రెండూ ఒకటే"

"కాదులే, ఊరుకో."

"వినిమయమంటే మారకం వేసుకోవటమేలే. ఖర్చు చెయ్యటంకాదు."

"ఖర్చు చెయ్యటానికి వినిమయమని రాస్తున్నానే?"

"ఇక ఎప్పుడూ రాయబోక!"

టెలిఫోను మోగింది.

కైలాసం లియాఖతాలీని తప్పించుకోవటానికి లేచి టెలిఫోను దగ్గిరికివెళ్ళి రిసీవరందుకున్నాడు. రాయిటర్సు ఆఫీసు వాళ్ళు.

"మెషీన్ పనిచేస్తున్నదా?"

"లేదే."

"లైన్ ట్రబులేమో కనుక్కుంటాం. మెకానిక్ వచ్చాడా?"

"రాలేదు."

"కాపీలు తెచ్చాడా?"

"మెకానిక్ రాలేదు" అని అరిచాడు కైలాసం.

"అట్లా చెప్పరాదా? ఎందుకు కోపం చేసుకొంటారు?" అని మందలించింది రిసీవరు.

"కైలాసంగారూ, రైలు ప్రమాదంమీద స్టేట్మెంటు

వచ్చింది. మిగిలినవి మానేసి అది కాస్తరాయండి, ఇదిగో స్టేట్మెంటు"

మళ్ళీ సంభాషణ ఆరంభమయింది.

"ఈ విధంగా రైళ్ళు పడగొట్టే కమ్యూనిస్టులు ఉన్న కాస్త మర్యాదా పోగొట్టుకున్నారు"

"ఇది కమ్యూనిస్టులపనే! హారిపిళ్ళకడుపుడకా!... ఇంకా మీకేమన్నా సందేహమా ఏమిటి?"

"ఎంతమందిని పొట్టనపెట్టుకున్నారో."

"ఇదే విప్లవం!"

ఇటువంటి పనులుచేసినా కమ్యూనిస్టులను వెనకేసుకొచ్చేవాళ్ళున్నారు. అందుకనర్థంకోవాలి."

"భగవాన్లూ! చూశావా ఎట్లా అంటున్నారో? చూస్తావేం?"

"నన్నేం చెయ్యమన్నావు?"

"కమ్యూనిస్టులు రైళ్ళు పడగొడుతున్నారుట."

"పడగొట్టని. విచారణ జరిపి శిక్షించేవాళ్ళులేరూ?"

"అట్లా జారిపోతావేం?"

"జారేందు కేముందీ? కొందరికి చూడకుండానే వార్తలు తెలుస్తాయి. దాని కెవరేంచేస్తారు?

"రైళ్లు పడగొట్టే వాళ్ళింకెవరూ లేరని మాకు ఆపాటి తెలుసులే. కాస్త మాకూ ఆమాత్రం ఊహించే శక్తిఉంది, దాం దుంపతెగ ఎంత ఇదయినా!" అన్నాడు సత్యనారాయణ.

"ఆ శక్తి ఎవరుమటుకువారు తమకుండటం అర్థం చేసుకోగలరుగాని ఇంకొకరికుండటం అర్థంచేసుకోలేరు. అక్కడే చిక్కొచ్చేది' అన్నాడు భగవాన్లు.

"అయితే కమ్యూనిస్టులు రైళ్ళు పడగొట్టటం లేదంటావు?"

"నేనేమీ అనలేదు. ఎవరు పడగొడుతున్నదీ ఎప్పటికైనా తెలియదా అంటాను."

ఆ వాదన అంతటితో ఆగిపోయింది.

కైలాసానికి క్షణక్షణానికి విసుగు జాస్తి అవుతున్నది. అతను అయిదు నిమిషాలలోపల రెండుసార్లు గడియారం కేసిచూసి, "ఈమధ్య అయిదు నిమిషాలేనా అయింది? లేక గడియారం ఆగిపోయిందా!" అని ఆశ్చర్యపడ్డాడు.

మెకానిక్ వచ్చాడు, కాపీలతో.

"ఎటువంటి సమయంలో మెషీను చెడిపోయిందో!.. కైలాసంగారూ, మిగిలినవన్నీ ఆపేసి నెహ్రూ సీరీస్ తీసుకోండి."

"నెహ్రూ ఉపన్యాసమా?"

"అవును. ఇవాళ అదే స్ట్రీమరు.

అంతవరకూ సగం చచ్చినట్టున్న కైలాసం ఒంట్లోకి ఎక్కడలేని శక్తి వచ్చింది.

నెహ్రూ ఉపన్యాసం అయిదుభాగాలు చేతికొచ్చాయి. కైలాసం వాటిని ముందేసుకుని ఏకధాటిగా రాయటం మొదలుపెట్టాడు. చుట్టుపక్కల ఏంజరుగుతున్నదీ

కైలాసానికి తెలీదు. మెషీను ఎప్పుడు బాగయిందీ తెలీదు. నెహ్రూ సీరీస్ మరి మూడుభాగాల కాపీలు ఎప్పుడు ఎవరు తెచ్చారో తెలీదు. నెహ్రూ తొమ్మిదో భాగంనుంచీ మెషీనుమీద కాగితాలే వచ్చాయి. రెండు గంటలలోపుగా మూడు కాలముల తర్జుమా లాగి అవతల పారేశాడు కైలాసం.

* * *

«ఏమేవ్? పేపరు చూశావా? ఇవాళ స్టీమరు హెడ్ లైను మనదే! ఎట్లా రాశాననుకున్నావు? శరపరంపరే ననుకో,» అన్నాడు కైలాసం మహోల్లాసంతో.

"ఏం స్టీమరో? ఈపూట కూరేదొరకలేదు. పొద్దున కూడా పాపం, మీకు తిండి సరిగా అమరలేదు. ఈపూటేం తింటారో నా కర్థంకాలా!" అన్నది భార్య.

«ఏ కందిపచ్చడో చేసి, ఇంతచారు పెట్టవే. అంతకంటె ఏం కావాలి?» అన్నాడు కైలాసం, ఎంత అణచినా అణగని ఉత్సాహంతో.